సాక్షి
తిరుపతి
సోమవారం । 8 । జూలై । 2024



మహిళలే కీలకం

కుటుంబాన్ని, సమాజాన్ని సక్రమంగా తీర్చిదిద్దడంలో మహిళల పాత్ర ఎంతో కీలకమని లక్ష్మీపతి అన్నారు. - 8లో



ఎగసి పడుతున్న అలలు

అల్పపీడనం ప్రభావంతో ఆదివారం రాత్రి వాకాడు మండల వ్యాప్తంగా పెనుగాలులతో కూడిన వర్షం కురిసింది. - 8లో



తైక్వాండో విజేత నాయుడుపేట

జిల్లా స్థాయి తైక్వాండో పోటీలకు మంచి స్పందన లభించింది. పలు ప్రాంతాల క్రీడాకారులు తమ సత్తా చాటారు. - 8లో

న్యూస్‌రీల్

వైఎస్సార్ జయంతి జయప్రదం చేయండి



వెంకటగిరి(సైదాపురం): దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి పురస్కరించుకుని సోమవారం వేడుకలు ఘనంగా నిర్వహించాలని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆదివారం పిలుపునిచ్చారు. ఆయన మాట్లాడుతూ, తిరుపతి పార్లమెంట్ పరిధిలో ఆయా మండలాలు, గ్రామాల్లో ఉన్న వైఎస్సార్ విగ్రహాల వద్ద స్థానిక నాయకులు వేడుకలు నిర్వహించాలని, అందరూ కలసికట్టుగా జయప్రదం చేయాలని కోరారు.

ఏహెచ్ డిప్లొమో కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి సిటీ: ఎస్వీ వెటర్నరీ వర్సిటీలో అనిమల్ హస్బెండరీ (ఏహెచ్) పాలిటెక్నిక్ డిప్లొమో రెండేళ్ల కాలవ్యవధి గల కోర్సుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ చెంగల్రాయులు ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఎస్‌సీ లేదా తత్సమాన పరీక్ష పాసైన విద్యార్థులు సోమవారం నుంచి వర్సిటీ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తు గడువు ఈనెల 27వ తేదీతో ముగుస్తుందని, ఎస్ఎస్‌సీలో విద్యార్థి సాధించిన మార్కుల ఆధారంగా సీట్లు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు www.svvu.edu.in వెబ్‌సైట్‌ను పరిశీలించాలని కోరారు. మరిన్ని వివరాలకు పనిదినాలలో 9398647710, 9398813600 నంబర్లకు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని తెలియజేశారు.

అధికారులు అంతా హాజరుకండి

నేడు 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక: కలెక్టర్

తిరుపతి అర్బన్: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికకు జిల్లా అధికారులు అంతా హాజరుకావాలని కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించే ఈ కార్యక్రమాన్ని జిల్లా ప్రజలు సమస్యలను పరిష్కరించుకోవడానికి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరోవైపు ఎంపీడీఓలు, తహసీల్దార్లు, మున్సిపల్ కార్యాలయాలు, డివిజన్ కార్యాలయాల్లోను ఇదే కార్యక్రమం నిర్వహించాలని ఆదేశించారు.

శ్రీవారి దర్శనానికి 10 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో 24 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు 77,995 మంది స్వామివారిని దర్శించుకోగా, 30,250 మంది తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ. 3.72 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే, దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 10 గంటల్లో, ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ దాడులు



ఎరువుల దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

వెంకటగిరి రూరల్: నియోజకవర్గంలోని వెంకటగిరి, బాలాయపల్లె, డక్కిలి మండలాల్లోని ఎరువుల దుకాణాలపై ఆదివారం వ్యవసాయ, విజిలెన్స్ అధికారులు దాడులు చేశారు. ఏడీఏ ఎస్పీ ఎల్లప్ప, విజిలెన్స్ అధికారులు డి.జీవానందం, వెంకటగిరి ఏడీఏ ఎం.నాగార్జున సాగర్ ఆధ్వర్యంలో ఈ దాడులు చేశారు. సరైన లైసెన్స్, సంబంధించిన పత్రాలను లేని దుకాణాలను గుర్తించి రూ.3.28లక్షలు మందుల విక్రయాలు నిలుపుదల చేశారు. వారు మాట్లాడుతూ, కమిషనర్ ఆఫ్ అగ్రికల్చర్ (విజయవాడ) ఆదేశాల మేరకు రాష్ట్రస్థాయి బృందం సంయుక్త తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎరువుల దుకాణాలదారులు నాణ్యమైన ఎరువులను విక్రయించాలన్నారు. అక్రమంగా నిల్వ చేసినా, అధిక ధరలకు విక్రయించినా లైసెన్సులు రద్దుచేసి, 6–ఏ కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఈఎస్ వరప్రసాద్, ఏఓ శిరీష తదితరులు పాల్గొన్నారు.

ఇసుక.. మస్కా



గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో...

మాది మండల కేంద్రమైన కోట గ్రామం. నా పేరు కొండయ్య. ఏడాది క్రితం మా పెద్ద కుమారుడు వెంకటయ్యకి ఒక ఇంటిని నిర్మించాం. అప్పటి ప్రభుత్వం టన్ను ఇసుక రూ.675కి ఇచ్చింది. ట్రాక్టర్‌కు 5 టన్నుల ఇసుక పడుతుంది. ఈ లెక్కన ప్రభుత్వానికి రూ.3,375 చెల్లించేవాళ్లం. కోట మండలంలో కొండుగుంట వద్ద ఇసుక స్టాక్ పాయింట్ ఉండేది. మా కోట గ్రామం నుంచి కొండుగుంటకు 13 కిలోమీటర్లు ఉంది. ట్రాక్టర్ బాడుగ 1,100 ఇచ్చేవాళ్లం. మొత్తంగా ఒక ట్రాక్టర్ ఇసుక రూ.4,475కి వచ్చేది. ఒక్కో నియోజకవర్గానికి రెండు ఇసుక స్టాక్ పాయింట్లు ఉండేవి.

ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో...

మా చిన్న కుమారుడు గురవయ్యకు ఇంకో ఇంటిని నిర్మించడానికి ఏర్పాట్లు చేస్తున్నాం. ఇసుకకు ఈ ప్రభుత్వం నిర్ణయించిన రేట్లు లెక్కలు వేసుకుంటే... గూడూరు నియోజకవర్గంలో ఎక్కడా ఇసుక పాయింట్ పెట్టలేదు. మేము వెంకటగిరి మండలంలోని మొగళ్లగుంట ఇసుక స్టాక్ పాయింట్‌లో తెచ్చుకోవాలని చెప్పారు. అక్కడ టన్ను రూ.590కి ఇస్తోంది. దీంతో టన్నుపై 85 తగ్గిందని సంతోషపడ్డాం. అయితే మా గ్రామం కోట నుంచి మొగళ్లగుంటకు 62 కిలోమీటర్లు వస్తోంది. టన్ను రూ.590 చొప్పున ట్రాక్టర్‌కు 5 టన్నులు రూ.2,950 అవుతుంది. అయితే ట్రాక్టర్ బాడుగ రూ.6,200 అడుగుతున్నారు. ఇసుక పోయడానికి కూలీలకు రూ.700 అదనంగా ఇవ్వాలని చెబుతున్నారు. దీంతో ట్రాక్టర్ ఇసుక ఇంటికి చేరేవరికి రూ.9,850 ఖర్చు అవుతుంది. గత ప్రభుత్వంతో పోల్చుకుంటే ట్రాక్టర్ ఇసుకపై అదనంగా రూ.5,375 ఖర్చు అవుతుంది.

- ఇసుక ఉచిత హామీకి బాబు, పవన్ మంగళం
- టన్ను ధర రూ.590
- జిల్లాలో నాలుగు ఇసుక పాయింట్లే
- తడిసిమోపుడు కానున్న రవాణా భారం
- గతం కంటే రేట్లు పెరిగే అవకాశం
- లబోదిబోమంటున్న నిర్మాణదారులు
- గత ప్రభుత్వంలో ఒక్కో నియోజకవర్గంలో ఒక్కో ఇసుక పాయింట్

తిరుపతి అర్బన్: తిరుపతి జిల్లాలో 7 నియోజకవర్గాలు, 34 మండలాలు ఉన్నాయి. అయితే మూడు నియోజకవర్గాల్లో నాలుగు మండలాల్లో మాత్రమే నాలుగు ఇసుక పాయింట్లు ఎంపిక చేశారు. సత్యవేడు నియోజకవర్గంలో నాగలాపురం మండలంలోని సుబ్బానాయుడుకండ్రిగ, పిచ్చాటూరు మండలంలోని ఏకే బేడు, సూళ్లూరుపేట నియోజకవర్గంలో మావిళ్లపాడు, వెంకటగిరి నియోజకవర్గంలో మొగళ్లగుంట ఇసుక పాయింట్లను మాత్రమే ఎంపిక చేశారు. శ్రీకాళహస్తి, తిరుపతి, గూడూరు, చంద్రగిరి నియోజకవర్గాల్లో ఇసుక పాయింట్లకు అవకాశం ఇవ్వలేదు. దీంతో ఈ నాలుగు నియోజకవర్గాలకు చెందిన వారు తమకు సమీపంలోని ఇసుక పాయింట్ల వద్దకు వెళ్లాలన్నా కనీసం 50–100 కి.మీ పైగా దూరం వెళ్లాల్సిన పరిస్థితి. ఈ లెక్కన టన్ను ఇసుక కొనుగోలుకు ఎంత చెల్లిస్తారో...అంతకు మించి రవాణా ఖర్చు భరించాల్సిందేనని నిర్మాణదారులు ఆందోళన చెందుతున్నారు. ఎన్నికల హామీల్లో భాగంగా సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఉచితంగా ఇసుక ఇస్తామని.. ఇప్పుడు ఇలా తిప్పలు పెట్టడం ఎంతవరకు న్యాయమని భవన నిర్మాణదారులు ప్రశ్నిస్తున్నారు.

మండలం	ఇసుక పాయింట్	టన్ను ధర (రూ.లలో)
వెంకటగిరి	మొగళ్లగుంట	590
సూళ్లూరుపేట	మావిళ్లపాడు	465
పిచ్చాటూరు	ఏకే బేడు	200
నాగలాపురం	సుబ్బానాయుడుకండ్రిగ	200

రవాణాపై ఆందోళన

గత ప్రభుత్వ పాలనలో తిరుపతి మినహా మిగిలిన నియోజకవర్గాల్లో ఒక్కో ఇసుక పాయింట్‌ను ఏర్పాటు చేశారు. దీంతో రవాణా సమస్యలు ఉండేవి కావు. దాదాపు అన్నిచోట్లా స్వర్ణముఖినది ఆధారంగానే ఇసుక స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేశారు. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం మూడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో నాలుగు పాయింట్లు ఎంపిక చేయడంతో రవాణా చార్జీలపై అంతా ఆందోళన చెందుతున్నారు. గూడూరు నియోజకవర్గంలో ఇసుక పాయింట్ లేకపోవడంతో వారంతా వెంకటగిరి మొగళ్లగుంట పాయింట్‌కు రావడానికి 50–60 కిలోమీటర్లు దూరం వెళ్లాల్సి ఉంది. లేదా సూళ్లూరుపేట మావిళ్లపాడు పాయింట్‌కు వెళ్లాలంటే దాదాపు 55–65 కిలోమీటర్లు ఉంది. ఇక శ్రీకాళహస్తి నియోజవర్గ ప్రజలు నాగలాపురం పాయింట్‌కి వెళ్లాలంటే 50–60, పిచ్చాటూరు పాయింట్‌కు వెళ్లడానికి 55–65 కిలోమీటర్లు ఉంది. తిరుపతి, చంద్రగిరి వాళ్లు పిచ్చాటూరు పాయింట్‌కు వెళ్లడానికి 50–105 కిలోమీటర్లు పైగా వెళ్లాల్సి ఉంది. ప్రస్తుతం ట్రాక్టర్ లోడు ఇసుకకు పది కిలో మీటర్లకు రవాణా చార్జీ కింద రూ.1000 చెల్లిస్తున్నారు. ఈ లెక్కన తిరుపతిలో నిర్మాణదారుడు పిచ్చాటూరుకెళ్లి ట్రాక్టర్ లోడు ఇసుక తెచ్చుకోవాలంటే

ఆ నియోజకవర్గాల్లో ట్రాక్టర్ ఇసుక రూ.10వేల పైచిలుకే!

సాధారణంగా జిల్లాలో ఇసుక రవాణాకు ట్రాక్టర్ డ్రైవర్లు దూరాన్ని బట్టి బాడుగ తీసుకుంటారు. 10 కిలోమీటర్ల దూరం అయితే రూ.1,200 నుంచి రూ.1,400, అదే 20 కిలోమీటర్లకు రూ.2,100 నుంచి రూ.2,300 వరకు, 60 కిలోమీటర్లు అయితే రూ.6,000 నుంచి రూ.6,400 తీసుకుంటారు. జిల్లాలో చంద్రగిరి, తిరుపతి నియోజకవర్గాల ప్రజలు పిచ్చాటూరు, నాగలాపురం, వెంకటగిరిలోని ఇసుక స్టాక్ పాయింట్లకు వెళ్లడానికి 50 నుంచి 105 పైచిలుకు కిలోమీటర్ల దూరం ఉంది. ఈ లెక్కన వీరికి రవాణా భారం ఎక్కువ పడుతుంది. మొత్తంగా ఇసుక పాయింట్లు లేని నియోజకవర్గంలో ఒక ట్రాక్టర్ ఇసుక అవసరమైన వారు రూ.10వేలకు పైగా ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఇసుక పాయింట్లు ఉన్న చోట ట్రాక్టర్‌కు రూ.6వేల నుంచి రూ.6,500 చెల్లించాల్సిన పరిస్థితులు ఉన్నాయి. గత ప్రభుత్వంలో అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఒకటి రెండు ఇసుక పాయింట్లు ఉండడంతో రవాణా చార్జీలకు ఇబ్బంది ఉండేది కాదు.

పేదలపై రవాణా భారం

ఒక ట్రాక్టర్‌కు 5 టన్నుల ఇసుక పడుతుంది. 20 టన్నులు అంటే రోజుకు నాలుగు ట్రాక్టర్ల ఇసుకకు మాత్రమే అనుమతి ఉంటుంది. నూతన ఇసుక విధానాన్ని చూస్తే..రోజూ ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే అనుమతి ఉంటుంది. ఉదాహరణకు గూడూరు నియోజకవర్గం వారు వెంకటగిరి పరిధిలోని మొగళ్లగుంట ఇసుక పాయింట్ వద్ద టన్ను రూ.590 చొప్పున ఒక ట్రాక్టర్‌కు 5 టన్నులు భర్తీ చేయడానికి రూ.2,950 ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుంది. అలాగే ఇందుకుగాను ట్రాక్టర్ బాడుగ రూ.3 వేల నుంచి 3,500 చెల్లించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో ఒక ట్రాక్టర్ ఇసుక ఇంటికి చేరడానికి రూ.6 వేల నుంచి రూ.6,500 వెచ్చించాల్సి వస్తుంది. దూరం పెరిగే కొద్దీ రవాణా భారమేనని స్పషమవుతోంది. ఇది సామాన్య ప్రజలకు ఎంత ఇబ్బందో ఇట్టే బోధపడుతుంది.

సగం డబ్బు డీజిల్‌కే అవుతుంది

డీజిల్ లీటర్ రూ.99.50 ఉంది. సగం డబ్బులు డీజిల్‌కు ఖర్చు చేస్తున్నాం. 10 కిలోమీటర్లకు రూ.1,200, అదే 60 కిలోమీటర్లు అయితే రూ.6వేలు బాడుగు తీసుకుంటాం. 100 కిలోమీటర్లు అయితే రూ.10 వేలు ఇవ్వాల్సిందే తప్పదు. లేదంటే మాకు గిట్టుబాటు కాదు. ట్రిప్పుకు 5 టన్నులు మాత్రమే పోసుకుంటాం. ట్రిప్పర్లు అయితే 20 టన్నుల వరకు లోడు చేయొచ్చు. వారు బాడుగ రూ.30వేల నుంచి రూ.50వేలు అడుగుతారు.

ధర్మయ్య, ట్రాక్టర్ డ్రైవర్, చిన్నగొట్టిగల్లు

గూడూరులో ఇసుక పాయింటేదీ?

ఇల్లు కడుతున్నాం. ఇసుక చాలా అవసరం. అయితే గూడూరు నియోజకవర్గంలో గతంలో వాకాడు, కోట, చిట్టమూరులో ఇసుక పాయింట్లు ఉండేవి. ఇసుక కొనుగోలుకు రూ.3వేలు చెల్లిస్తే బాడుగ రూ.2వేలు ఇచ్చేవాళ్లం. కూటమి ప్రభుత్వ వచ్చాక ఇసుక పాయింట్లు గూడూరు నియోజకవర్గంలో లేవు. దీంతో మేము వెంకటగిరి మొగళ్లగుంటకు లేదా సూళ్లూరుపేట మావిళ్లపాడు పాయింట్‌కు వెళ్లాల్సి వస్తుంది. సుమారు 55–65 కిలోమీటర్లు వెళ్లాలి. ట్రాక్టర్ ఇసుకకు రూ.3వేలు ప్రభుత్వానికి, ట్రాక్టర్ బాడుగ రూ.6,500 చెల్లించాలి. ఇసుక కోసమే రూ.2 లక్షలు ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి ఉంటోంది.

శ్రీనివాసులు, గూడూరు, వినియోగదారుడు



నాలుగు పాయింట్లలో ఎక్కడైనా తెచ్చుకోండి

జిల్లాలో ఇసుక పాయింట్లు నాలుగు ఏర్పాటు చేస్తున్నాం. ఏ పాయింట్ వద్ద ఇసుక స్టాక్ ఉంటే అక్కడి నుంచి తెచ్చుకోండి. మీ మొబైల్ ద్వారా స్టాక్ యార్డ్‌లో ఎంటర్ క్లిక్ చేస్తే తిరుపతి జిల్లా వస్తుంది. స్టాక్ పాయింట్‌ను ఎంపిక చేసుకుని వినియోగదారుడు వివరాలను పొందుపరిస్తే క్యూ ఆర్ కోడ్ వస్తుంది. ఆ స్టాక్ పాయింట్ మొత్తాన్ని డిజిటల్ పేమెంట్ చేయొచ్చు. ఫిర్యాదుల నిమిత్తం టోల్ ఫ్రీ నంబర్ 1800–4256035, 0877 2999077 ఏర్పాటు చేశారు. ఈ నంబర్లకు సమస్యలు తెలియజేయవచ్చు. అలాగే dmgotirupatisandcompalints@ myyahoo. com కు సమాచారం తెలియజేయండి.

–ఎస్.వెంకటేశ్వర్, కలెక్టర్

రైతు బాంధవుడు వైఎస్సార్



వర్సిటీలోని పశువైద్య కళాశాల డైమండ్ జూబ్లీ చిహ్నం



శ్రీసిటీ లో 2008లో అప్పటి సీఎం వైఎస్సార్ 8 పరిశ్రమలు ప్రారంభిస్తున్న దృశ్యం (ఫైల్)



శ్రీసిటీ ఏరియల్ వ్యూ

- ఆయన హయాంలోనే తిరుపతిలో పశువైద్య విశ్వవిద్యాలయం
- పాడి పరిశ్రమాభివృద్ధికి ఎనలేని కృషి
- పశుజాతుల పరిరక్షణే ధ్యేయంగా పరిశోధనలు
- నేడు వైఎస్సార్ 75వ జయంతి

తిరుపతి సిటీ: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి పాడి పరిశ్రమ అభివృద్ధికి ఎనలేని కృషి చేసి రైతు బాంధవుడుగా తెలుగు ప్రజల గుండెల్లో చిరస్మరణీయులయ్యారు. తిరుపతిలోని ఎస్వీ వెటర్నరీ యూనివర్సిటీ వైఎస్సార్ మానసపుత్రికగా నిలిచిపోయింది. ఎస్వీ వెటర్నరీ వర్సిటీ ఏర్పాటుకు 2004 సెప్టెంబర్ 30న బీజం పడింది. అప్పటి సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి తిరుపతి వెటర్నరీ కళాశాల స్వర్ణోత్సవాలకు ముఖ్యఅతిథిగా హాజరై వెటర్నరీ కళాశాలకు యూనివర్సిటీగా గుర్తింపు తెచ్చేందుకు ప్రయత్నిస్తానని హామీ ఇచ్చి, 2005 జూలై 15న వర్సిటీగా గుర్తింపునిచ్చారు. పాడి పరిశ్రమ అభివృద్ధి, పాల ఉత్పత్తి పెంపు, జంతుసంపదను వృద్ధి, పశువైద్యంపై దృష్టి, పశుజాతుల సంరక్షణపై విస్తృత పరిశోధనలు ..ఇత్యాది లక్ష్యాలతో వర్సిటీ అభివృద్ధి చెందాలని అధికారులకు ఆయన నిర్దేశించారు. తొలుత రూ.45కోట్లు కేటాయించిన వైఎస్సార్ మరో విడతలో వర్సిటీ మౌలిక వసతుల కల్పనకోసం రూ.100కోట్లు కేటాయించారు. కాలక్రమంలో వెటర్నరీ వర్సిటీ అంచెలంచెలుగా ఎదిగి మహా వృక్షంలా విరాజిల్లుతోంది. ప్రసుత్తం వర్సిటీ పరిధిలో తిరుపతి, గన్నవరం, ప్రొద్దుటూరు, గరివిడిలో వెటర్నరీ కళాశాలలు, తిరుపతిలో డెయిరీ టెక్నాలజీ కళాశాల, ముత్తుకూరులో మత్స్య కళాశాలలు ఉన్నాయి. అలాగే పాలిటెక్నిక్ కళాశాలలు 30 ఉన్నాయి. వీటిలో యూజీ, పీజీ, పీహెచ్‌డీ కోర్సులతో పాటు అనిమల్ హస్బెండరీలో పాలిటెక్నిక్ కోర్సులు సైతం ఉన్నాయి. విద్యార్థుల సంఖ్య 3వేలకు పైగా చదువుతున్నారు. అధ్యాపకులు 305 మంది, బోధనేతర సిబ్బంది 2,545 మంది ఉన్నారు. అలాగే పరిశోధన సంస్థలో ప్రపంచంలోనే పేరొందిన పుంగనూరు, ఒంగోలు జాతి పశు సంతతి అభివృద్ధికి, పిండమార్పిడి విధానంలో ఈ జాతులను పెంపొందించేందుకు వర్సిటీ కృషి చేస్తోంది. ఇక్కడ చదివిన వారెందరో దేశ విదేశాల్లో రాణిస్తున్నారు.

మరువలేని 8.8.2008


2006లో అధికారికంగా శ్రీసిటీ సెజ్‌కు పచ్చజెండా ఊపి 8.8.2008లో 8 పరిశ్రమలకు అప్పట్లో ముఖ్యమంత్రిగా వైఎస్ రాజశేఖరరెడ్డి శంకుస్థాపన చేశారు. 8 పరిశ్రమలతో మొదలైన శ్రీసిటీ పారిశ్రామికవాడ అంచెలంచెలుగా అభివృద్ధి చెంది 200 పైచిలుకు పరిశ్రమలకు కేంద్రంగా మారింది. సుమారు రూ.50వేల కోట్ల పెట్టుబడులతో 27 దేశాలకు చెందిన పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. పలు పరిశ్రమల ఉత్పత్తులు ఎగుమతులవుతున్నాయి. ప్రత్యక్షంగా, పరోక్షంగా 50వేలకు పైగా ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి.

సత్యవేడుపై వైఎస్ఆర్ చెరగని ముద్ర

వరదయ్యపాళెం: ఆంధ్ర–తమిళనాడు రెండు రాష్ట్రాల సరిహద్దులోని వెనుకబడిన ప్రాంతమైన సత్యవేడు నియోజకవర్గం 2004 నుంచి 2009 మధ్యలో అన్ని విధాలా అభివృద్ధి చెందింది. అప్పటి సత్యవేడు స్థానిక ఎమ్మెల్యే కళత్తూరు నారాయణస్వామి చొరవతో నియోజకవర్గాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలన్న సంకల్పానికి దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ చేయూతనిచ్చారు. 2004లో ముఖ్యమంత్రి పీఠం ఎక్కిన వెంటనే 'వైఎస్ఆర్ రాజీవ్ పల్లెబాట' పేరిట జిల్లాలోనే సత్యవేడు నియోజకవర్గంలో తొలిసారిగా పర్యటించిన ఆయన వరాల జల్లుతో ఈ ప్రాంతం అభివృద్ధికి నాంది పలికారు. సత్యవేడులో ప్రభుత్వ డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలలతో పాటు ఉబ్బలమడుగు, భూపతేశ్వరకోన, రాళ్లవాగు నీటి ప్రాజెక్టుల ఏర్పాటు చేశారు.

వ్యవసాయానికి పెద్దపీట

నాగలాపురం, సత్యవేడు మండలాలకు చెందిన 3వేల ఎకరాలకు సాగునీరు అందించే దిశగా నాగలాపురం మండలంలో రూ.5.50కోట్లతో భూపతేశ్వరకోన ప్రాజెక్టును 2008–09లో, అలాగే బుచ్చినాయుడుకండ్రిగ, వరదయ్యపాళెం మండలాల సాగునీటి అవసరాల కోసం రూ. 19కోట్లతో 2600 ఎకరాల సాగునీరు అందించేందుకు వరదయ్యపాళెం సమీపంలో ఉబ్బలమడుగు సాగునీటి ప్రాజెక్టును నిర్మించారు. తెలుగంగ ప్రధాన కాలువ నుంచి చెరువులకు నీటిని నింపి తద్వారా 18వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు రూ. 100కోట్లతో ఉపకాలువలు నిర్మించారు.



నాగలాపురం మండలంలో నిర్మించిన భూపతేశ్వరకోన ప్రాజెక్టు

విద్యా సంస్థలకు ప్రాధాన్యం

సత్యవేడుకు కలగా మిగిలిన డిగ్రీ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాల, 9 హైస్కూళ్లు, ఒక తమిళ మీడియం స్కూల్ ఏర్పాటు చేయడంతో ఇంటర్ తర్వాత ఉన్నత విద్యకు సుదూర ప్రాంతాలకు వెళ్లే అగత్యం తప్పింది. దీంతో విద్యార్థులు, తల్లిదండ్రులు మహానేతను విద్యాదాతగా స్మరిస్తున్నారు.

పెద్దిరెడ్డి అయ్యప్పమాల ధారణ

తిరుపతి కల్చరల్: పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదివారం శ్రీకపిలేశ్వరస్వామి ఆలయంలో అయ్యప్ప మాలధారణ స్వీకరించారు. ముందుగా ఆలయానికి చేరుకున్న ఆయన అక్కడ పుష్కరిణిలో స్నానమాచరించి, స్వామివారిని దర్శించుకుని అర్చక పండితులచేత అయ్యప్ప మంత్ర పఠనం చేశారు. అనంతరం అయ్యప్ప మాలధారణ స్వీకరించారు. తర్వాత పుంగనూరు నియోజకవర్గంలోని సదుం మండలం, యర్రాతివారిపల్లెలో కొలువైన శ్రీకోటమలై అయ్యప్ప స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



అయ్యప్ప మాలధారణ స్వీకరిస్తున్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

తుడా.. రేటు దడ!

- అయినా..తగ్గేదేలే..!
- చైర్మన్ పదవి కోసం పోటాపోటీ
- నిన్నగాక మొన్న వచ్చిన వ్యక్తికి సిఫార్సు లేఖ
- మరో ఇద్దరికి హామీ!
- చైర్మన్ పోస్టు కోసం భారీగా ముడుపులు



సాక్షి, టాస్క్‌ఫోర్స్: తిరుపతి పట్టణాభివృద్ధి (తుడా) సంస్థ చైర్మన్ పదవి కోసం కూటమిలో నువ్వా, నేనా? అనే లెవెల్లో పోటీ పడుతున్నారు. ఎవరికి వారే పైరవీలతో దక్కించుకునేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. ఎమ్మెల్యే, మంత్రి, ఢిల్లీలోని బీజేపీ నేతల నుంచి ఒత్తిళ్లు చేయిస్తున్నారు. తాజాగా చైర్మన్ పదవి కోసం ఓ ప్రజా ప్రతినిధి నిన్నగాక మొన్న పార్టీలో చేరిన యువకుడికి ఇవ్వమని సిఫారసు లేఖ పంపినట్లు విశ్వసనీయ సమాచారం. ఈ లేఖ ఇవ్వడానికి ఆ ప్రజా ప్రతినిధి భారీగా పుచ్చుకున్నట్లు తిరుపతిలో జోరుగా ప్రచారంలోకి వచ్చింది.. ఇది తెలిసిన ఆశావహులు ఆ నాయకుడిని నేరుగా నిలదీసినట్లు తెలిసింది. తిరుపతిలో మీ ఇష్టం వచ్చినట్లు నడుచుకోవాలని చూస్తే బుద్ధి చెప్పి తీరుతాం! అని తీవ్రస్థాయిలో హెచ్చరించినట్లు కూటమి శ్రేణుల్లో చర్చ జరుగుతోంది. మంత్రి వర్గ విస్తరణలో ఉమ్మడి చిత్తూరు జిల్లాకు మొండిచేయి మిగిలింది. జిల్లాలో ఉన్న కీలకమైన పదవులనైనా దక్కించుకునేందుకు టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు ఎవరికి వారు ప్రయత్నాల్లో పడ్డారు. వీటిలో తుడా చైర్మన్ ఒకటి. తుడా చైర్మన్ పదవి వస్తే.. అదనంగా టీటీడీ బోర్డు ఎక్స్‌అఫిషియో మెంబర్ అవ్వొచ్చనే ఆలోచనతో ఎమ్మెల్యేలు ప్రయత్నాలు చేస్తున్నారనే ప్రచారమవుతోంది. తుడా చైర్మన్ కోసం పలమనేరు ఎమ్మెల్యే అమర్‌నాథ్‌రెడ్డి, తిరుపతికి చెందిన మాజీ తుడా చైర్మన్ నరసింహయాదవ్, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, మాజీ ఎమ్మెల్యేలు ఎస్సీవీ నాయుడు, శ్రీధర్‌వర్మ, బీజేపీ నుంచి కోలా ఆనంద్, భానుప్రకాష్‌రెడ్డితో పాటు పసుపులేటి హరిప్రసాద్, కిరణ్‌రాయల్, కోడూరు బాలసుబ్రమణ్యం, జేబీ శ్రీనివాసులు మరి కొందరు ఆశావాహుల జాబితాలో ఉన్నారు. మొదటి నుంచి పార్టీ కోసం పనిచేస్తున్న వీరెవ్వరినీ కాకుండా బండ్ల లక్ష్మీపతిని తెరపైకి తీసుకొచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. ఇతను ఎన్నికలకు రెండు నెలల ముందు జనసేనలో చేరిన విషయం తెలిసిందే. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే తిరుపతి రుయా ఆసుపత్రి బోర్డు మెంబర్‌గా పదవిని కట్టబెట్టారు. తాజాగా తుడా చైర్మన్ గిరిని కట్టబెట్టేందుకు ఎమ్మెల్యే ఒకరు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. అదే విధంగా చిత్తూరుకు చెందిన ఇద్దరికి కూడా తుడా చైర్మన్ పదవి ఇప్పిస్తామని హామీ సైతం ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. పదవి విషయంలో భారీగా డబ్బులు చేతులు మారినట్లు తెలియడంతో ఆశావహులు ఆ ఎమ్మెల్యే తీరుపై భగ్గుమంటున్నారు. ఈ విషయాన్ని టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు ముఖ్యనేతల దృష్టికి తీసుకెళ్లటం గమనార్హం!

క్లుప్తంగా

యువకుడి ఆత్మహత్య

తిరుమల: తిరుమల జీఎన్సీ టోల్ గేట్‌కు సమీపంలోని అటవీ ప్రాంతంలో నెల్లూరు జిల్లాకు చెందిన యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన ఆదివారం సాయంత్రం వెలుగులోకి వచ్చింది. తిరుమల టూటౌన్ పోలీస్ స్టేషన్ సీఐ సత్యనారాయణ తెలిపిన వివరాల మేరకు.. టోల్ గేట్ సమీపంలోని అటవీ ప్రాంతంలో ఓ చెట్టుకు గుర్తుతెలియని 35 నుంచి 40 సంవత్సరాల వయస్సు కలిగిన యువకుడు తాడుతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసున్నాడు. స్థానికులు గుర్తించి తిరుమల పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతుని ఆచూకీ కోసం ప్రయత్నించగా అతని షర్ట్ వెనుక కాలర్‌పై సుధాటైలర్, అదురుపల్లి, నెల్లూరు అని రాసి ఉండడాన్ని గుర్తించారు. దీంతో సదరు టైలర్‌తో పోలీసులు మాట్లాడి మృతుడి వివరాలు తెలుసుకున్నారు. మృతుడు నెల్లూరు జిల్లా, చేజర్ల మండలం, పద్మావతి కండ్రిగ గ్రామానికి చెందిన మల్లెల భార్గవ్‌గా గుర్తించారు. మృతుని కుటుంబ సభ్యులకు సమాచారాన్ని అందించారు. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. అనంతరం దీనిపై కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు.

మోటార్ సైకిల్ ఢీ కార్మికుడికి గాయాలు

ఏర్పేడు: మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కార్మికుడికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు.. వికృతమాల డిక్షన్ కర్మాగారంలో మహారాష్ట్రకు చెందిన సందీప్(28) కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఆదివారం పని ముగించుకుని ఇంటికి కాలినడకన వెళుతుండగా రేణిగుంటకు వెళుతున్న గుర్తు తెలియని ద్విచక్రవాహనం వెనుక నుంచి అతడిని ఢీకొంది. గాయపడిన అతడిని చికిత్స నిమిత్తం రేణిగుంటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బీకాం జనరల్ డిగ్రీకి మంగళం

- ఉమ్మడి జిల్లాలోని 17 ప్రభుత్వ కళాశాలల్లో బీకాం జనరల్ కోర్సుకు స్వస్తి
- 1960 నుంచి గత ఏడాది వరకు కొనసాగిన కోర్సు
- టీటీడీ, ప్రైవేటు కళాశాలలకే పరిమితం చేసిన ప్రభుత్వం
- విద్యాశాఖ మంత్రిపై మండిపడుతున్న విద్యార్థి సంఘాలు



తిరుపతి సిటీ: విద్యారంగంపై నూతన ప్రభుత్వ వైఖరి స్పష్టమైంది. ప్రభుత్వం ఏర్పడిన నెలరోజులకే పలు డిగ్రీ కోర్సులను రద్దు చేసింది. 1960 నుంచి పేద విద్యార్థుల ఆశాజ్యోతిగా వెలుగొందుతూ ఎంతో మంది విద్యార్థులను అకౌంట్స్ ప్రొఫెషనల్స్‌గా, అకౌంటెట్లుగా, చార్టెడ్ అకౌంటెంట్లుగానూ, కంపెనీలకు మేనేజర్లు, సీఈఓలుగాను తీర్చిదిద్దిన బీకాం జనరల్ డిగ్రీకి ప్రభుత్వం మంగళం పాడింది. 2024–25 విద్యా సంవత్సరంలో డిగ్రీ అడ్మిషన్ల కోసం విడుదల చేసిన నోటిఫికేషన్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో బీకాం జనరల్ కోర్సు ఆప్షన్‌ను తీసివేసింది. దీంతో ఇక బీకాం జనరల్ కోర్సు ఇక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అదృశ్యమైనట్టే. అయితే టీటీడీ, ప్రైవేటు కళాశాలల్లో మాత్రం ఈ కోర్సును కొనసాగించేందుకు వెసులుబాటు కల్పించింది. దీంతో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలకు మొండిచెయ్యి చూపింది.

3వేల మంది విద్యార్థులకు ఎదురుదెబ్బ

ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని సుమారు 17 ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో బీకాం జనరల్ డిగ్రీకి నూతన ప్రభుత్వం మంగళం పాడేసింది. దీంతో ఉమ్మడి జిల్లాలతో పాటు సరిహద్దు జిల్లాలోని సుమారు 3వేల మంది విద్యార్థులకు ఎదురుదెబ్బ తగిలింది. బీకాం జనరల్ కోర్సులో చేరాలని ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలనే విద్యార్థులకు నిరాశే మిగిలింది. కోర్సు రద్దుపై విద్యార్థులు ప్రభుత్వంపై మండిపడుతున్నారు.

మంత్రి లోకేష్ స్పందించకపోతే ఉద్యమమే

కార్పొరేట్ విద్యాసంస్థలకు పెద్దపీట వేసే క్రమంలో ప్రభుత్వ కళాశాలలో బీకాం జనరల్ డిగ్రీ కోర్సును రద్దు చేసిందని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ మండిపడ్డారు. ఎన్నో ఏళ్లుగా కొనసాగే డిగ్రీని ప్రభుత్వం రద్దు చేయడం పేద విద్యార్థుల కడుపు కొట్టడమేనన్నారు. జిల్లాలో సుమారు 1,300 మందికిపైగా విద్యార్థులు ప్రతి ఏటా ఈ కోర్సులో అడ్మిషన్లు పొందుతున్నారని తెలిపారు. ప్రైవేటు కళాశాలల్లో కోర్సును రద్దు చేసి ప్రభుత్వ కళాశాలలో సీట్లు పెంచి కోర్సును కొనసాగించాలని డిమాండు చేశారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వెంటనే స్పందించి బీకాం జనరల్ కోర్సును ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోనూ కొనసాగించాలన్నారు. లేనిపక్షంలో విద్యార్థి సంఘాలతో సంఘటితంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు.

ఎగసి పడుతున్న అలలు

వాకాడు: అల్పపీడనం ప్రభావంతో ఆదివారం రాత్రి మండల వ్యాప్తంగా పెనుగాలులతో కూడిన వర్షం కురిసింది. మధ్యాహ్నం నుంచి ఆకాశం మేఘావృతమై పెనుగాలులతో మొదలై గంటకుపైగా వర్షం కురిసింది. అలాగే తూపిలిపాళెం సముద్ర తీరంలో అలలు ఎగసిపడుతున్నాయి. దీంతో మత్స్యకారులు తమ వేటసామగ్రిని ఒడ్డుకు చేరవేసే ప్రయత్నం చేస్తున్నారు. మండలంలో మూడు రోజులుగా ఎండ తీవ్రత ఎక్కువగా ఉంది. తూర్పు బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం అల్పపీడనంగా మారుతున్న నేపథ్యంలో మరో మూడు రోజు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ సమాచారం.


వాకాడులో పెనుగాలులతో కురుస్తున్న వర్షం

షాడో ఎమ్మెల్యేల 'దందా'గిరి

- ఎన్నికల్లో చేసిన ఖర్చు రాబట్టుకునే ప్రయత్నాలు
- ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ తండ్రి సోదరుని పని తీరుతో పార్టీల్లో అంతర్గత విభేదాలు

సూళ్లూరుపేట: అధికారంలోకి రావడమే ఆలస్యం.. అధికార పార్టీ ప్రజాప్రతినిధులు దందాలతో దండుకునే పనిలో పడ్డారు. ప్రజా సమస్యలపై దృష్టి సారించడానికి బదులు ఎన్నికల్లో తాము చేసిన ఖర్చును రాబట్టుకోవడానికే అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని సాక్షాత్తు అధికార పార్టీ నాయకులే ఆ పార్టీ ఎమ్మెల్యే కుటుంబంపై కారాలు మిరియాలు నూరుతున్నారు. సూళ్లూరుపేట ఎమ్మెల్యేగా నెలవల విజయశ్రీ గెలిచినప్పటికీ ఆమె తండ్రి నెలవల సుబ్రమణ్యం, సోదరుడు రాజేష్ అన్నీ తామై అధికారిక వ్యవహారాల్లో తలదూర్చడమే కాకుండా, ఇద్దరూ షాడో ఎమ్మెల్యేలుగా వ్యవహరిస్తూ, దందాలు చేసే పనిలో పడ్డారని పడ్డారని ఆ పార్టీ నాయకులే బాహాటంగా విమర్శలు గుప్పిస్తున్నారు. గత ప్రభుత్వం దొరవారిసత్రం మండలం మేలుపాక వద్ద రెండు పెద్ద కొండల్లా డంప్ చేసి నిల్వ చేసిన ఇసుకను అక్రమంగా తమిళనాడుకు తరలించి విక్రయించి రూ.50 లక్షల నుంచి రూ.80 లక్షల వరకు సొమ్ము చేసుకున్నారనే ఆరోపణలు చక్కర్లు కొడుతున్నాయి. దీనిపై సొంత పార్టీ నాయకులే స్థానికంగా ఉన్న గంగాప్రసాద్ లాంటి పెద్ద నాయకులకు ఫిర్యాదు చేశారు. అంతేకాకుండా ఇది పార్టీ అధిష్టానం వరకు వెళ్లడంతో జిల్లా మైనింగ్ అధికారులు ఇసుక డంపింగ్ కేంద్రాన్ని స్వాధీనం చేసుకుని పోలీస్ పహారా ఏర్పాటు చేశారు. దీంతో ఎమ్మెల్యే సోదరుడి దందా ప్రారంభమైందని ఆ పార్టీ నాయకులే అంతర్గతంగా చర్చించుకుంటున్నారు. ఇదే కాకుండా సూళ్లూరుపేట, తడ కేంద్రాలుగా తమిళనాడు బియ్యం అక్రమ రవాణా, ఏపీ పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా, గంజాయి, గుట్కాలు, పాన్ పరాగ్‌లు లాంటి అక్రమ వ్యాపారాలు ఆపేయాలని హుకుం జారీ చేశారు. అందరూ ఇది మంచిదే అని సంతోషించారు. అయితే వాస్తవానికి అక్రమ వ్యాపారాలు చేసుకోవాలంటే ముందు కప్పం కట్టి చేసుకోవాలని ఆదేశాలిచ్చారని తెలుగుతమ్ముళ్లే చెవులు కొరుక్కుంటున్నారు. ఇవే కాకుండా నియోజకవర్గంలో అధికారులు, సిబ్బంది బదిలీలు చేసుకోవాలంటే కూడా ఎంతో కొంత ముడుపులు ఇచ్చుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ముఖ్యంగా ఎస్ఐలు, సీఐ, తహసీల్దార్..తదితర పోస్టులకు ఎక్కువ మొత్తంలోనే డిమాండ్ చేస్తున్నట్టు సమాచారం. గతంలో ఏ ఎమ్మెల్యే కుటుంబం ఇలా చేయలేదని సొంత పార్టీకి చెందిన ఎండగడుతున్నారు. అయితే ఈ అక్రమాలను ఆ పార్టీలో ఎవరూ ప్రశ్నించేందుకు సాహసించడం లేదు. గెలిచాక నియోజకవర్గ ప్రజలకు సేవ చేయాలేగానీ ఇలా దందాలు చేయడం ఏమిటని అధికార పార్టీలోనే చర్చనీయాంశమైంది! ఎమ్మెల్యే తండ్రి, సోదరుడి వ్యవహార శైలి వల్ల ఎమ్మెల్యేకు అప్రతిష్ట రావడంతో పాటు అంతిమంగా టీడీపీని ప్రజలు ఏవగించుకునే పరిస్థితి వస్తుందని, దీనిని పార్టీ అధిష్టానానికి తెలియజేయాలని ఆ పార్టీలోని నాయకులు, కార్యకర్తలు ప్రయత్నాలు చేస్తున్నారు.

ఉపాధిలో ఇద్దరు టీఏలు, ఐదుగురు ఎఫ్ఏలు తొలగింపు

- రూ.1.35 లక్షలు రికవరీకి ఆదేశం

బుచ్చినాయుడుకండ్రిగ: మహాత్మాగాంధీ గ్రామీణ జాతీయ ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీలో నిధుల వినియోగంలో అవకతవకలకు పాల్పడిన ఇద్దరు టెక్నికల్ అసిస్టెంట్లు, ఐదుగురు ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగిస్తూ డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. పంచాయతీరాజ్, ఈజీఎస్, ఆర్‌డబ్ల్యూఎస్, హౌసింగ్, ఫారెస్టు, వెటర్నరీ, స్కూల్ ఎడ్యుకేషన్, వెలుగు, సెర్ప్ శాఖలకు సంబంధించి 2023–2024 వ సంవత్సరంలో 725 పనులకు రూ.6,39,66,735 వ్యయం చేశారు. ఈ పనులకు సక్రమంగా ఖర్చు చేశారా, లేదా? అనే దానిపై సామాజిక తనిఖీ నిర్వహించారు. పనులు చేయకుండా బిల్లులు చేశారని తేలడంతో టెక్నికల్ అసిస్టెంట్లు సందీప్, గాయత్రితోపాటు వీయస్‌పురం, జీఎన్‌కండ్రిగ, ఆర్ అనంతాపురం, నీర్పాకోట, పెద్దపాలేడు గ్రామ పంచాయతీలలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగిస్తూ పీడీ ఉత్తర్వులు జారీ చేశారు. 1,35,000 రూపాయలు రికవరీకి ఆదేశించారు.

18 నుంచి శ్రీకపిలేశ్వర స్వామి పవిత్రోత్సవాలు

తిరుపతి కల్చరల్: శ్రీకపిలేశ్వరస్వామివారి ఆలయంలో ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు మూడు రోజులపాటు పవిత్రోత్సవాలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఈ నెల 17వ తేదీన సాయంత్రం 6 గంటలకు పవిత్రోత్సవాలకు అంకురార్పణ చేస్తారు. ఏడాదిలో ఆలయంలో జరిగే అర్చనలు, ఉత్సవాల్లో తెలియక జరిగే దోషాల ద్వారా ఆలయ పవిత్రతకు లోపం రానీయకుండా శైవాగమశాస్త్రం ప్రకారం పవిత్రోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా 18న మొదటి రోజు ఉదయం ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం, సాయంత్రం కలశపూజ, హోమం, పవిత్ర ప్రతిష్ఠ నిర్వహిస్తారు. 19న రెండో రోజు ఉదయం గ్రంథి పవిత్ర సమర్పణ, సాయంత్రం యాగశాల పూజ, హోమం చేపడుతారు. 20వ తేదీన ఉదయం మహాపూర్ణాహుతి, కలశోద్వాసన, పవిత్ర సమర్పణ నిర్వహిస్తారు. సాయంత్రం 6 గంటలకు పంచమూర్తులైన శ్రీకపిలేశ్వరస్వామి, శ్రీకామాక్షి అమ్మవారు, శ్రీవిఘ్నేశ్వరస్వామి, శ్రీసుబ్రమణ్య స్వామి, శ్రీచండికేశ్వర స్వామి వారు పురవీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమివ్వనున్నారు.

సమాజాన్ని తీర్చిదిద్దడంలో మహిళలే కీలకం


జిల్లా ప్రభుత్వ సంస్థల మహిళా ఉద్యోగుల జిల్లా నూతన కమిటీ

- సేవలు అందించే దిశగా అడుగులు వేద్దాం
- ప్రభుత్వరంగ సంస్థల్లో 40 నుంచి 50 శాతానికి మహిళలు
- ఏపీజీఈఏ జిల్లా నూతన కమిటీ ఎంపిక

తిరుపతి అర్బన్: కుటుంబాన్ని, సమాజాన్ని సక్రమంగా తీర్చిదిద్దడంలో మహిళల పాత్ర ఎంతో కీలకమైందని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ లక్ష్మీపతి అన్నారు. ఆదివారం తిరుచానూరులోని మహిళా ప్రాంగణంలో ప్రభుత్వ మహిళా ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా విభాగం నూతన కార్యనిర్వాహక సభ్యులను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ క్రమంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోనే కాకుండా రాష్ట్రంలోని ప్రభుత్వ రంగ సంస్థల్లో మహిళా ఉద్యోగులు 40 నుంచి 50 శాతానికి చేరుకునే దిశగా అడుగులు పడుతున్నాయని పేర్కొన్నారు. మహిళా ఉద్యోగులకు సరైన గౌరవాన్ని కల్పించడం, పరిపూర్ణ భద్రత, ఉద్యోగుల ప్రగతిని అవసరమైన మూలధనం, ఉద్యోగుల శక్తిసామర్థ్యాలకు అవసరమైన నైపుణ్యాన్ని కల్పించే దిశగా సంఘం పని చేస్తోందని తెలియజేశారు. ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వాటిని పరిష్కరించే దిశగా పనిచేస్తామని చెప్పారు. మరోవైపు ఉద్యోగ సంఘంలో ఎవరికైనా సమస్యలు వస్తే వారికి అండగా ఉంటూ సేవలు అందించే దిశగా సంఘం అడుగులు వేయాలని ఆయన సూచించారు. జిల్లా మహిళా విభాగం ప్రెసిడెంట్‌గా ఎంపికైన శ్రీకాళహస్తి సీడీపీఓ శాంతి దుర్గా మాట్లాడుతూ, సంఘం బలోపేతానికి కృషి చేస్తామని చెప్పారు. సంఘం నేతృత్వంలో సమస్యలకు పరిష్కారం చూపడంతోపాటు మరోవైపు సేవా భావంతో సంఘంలో సభ్యులకు అండగా ఉంటామని అన్నారు. నిత్యం అందుబాటులో ఉంటామని ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపీజీఈఏ జిల్లా కార్యదర్శి సుబ్బరాయుడు, స్టేట్ కమర్షియల్ ట్యాక్స్ వైస్ ప్రెసిడెంట్ ప్రసాద్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా జిల్లా సంఘం ఎంపిక

జిల్లా మహిళా విభాగం ప్రెసిడెంట్‌గా శాంతిదుర్గ, కార్యదర్శిగా నాగమణి, ట్రెజరర్‌గా హరిత, ఆర్గనైజింగ్ సెక్రటరీగా చిట్టెమ్మ, ఉపాధ్యక్షులుగా ఈశ్వరమ్మ, మాధవి, ఫర్హానా, చెంచులక్ష్మి, తేజస్విని, ఉమ, జాయింట్ సెక్రటరీలుగా వనజ, కావమ్మ, చందన, అరుణ, కృష్ణవేణి, కార్యనిర్వాహక సభ్యులుగా అరుణదీపిక, నిఖిల, ఆదిలక్ష్మిలను ఎంపిక చేశారు.

హంస వాహనంపై పరాశరేశ్వరస్వామి చిద్విలాసం

నారాయణవనం: టీటీడీ అనుబంధ చంపకవల్లీ సమేత పరాశరేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో ఆదివారం రాత్రి స్వామి వారు హంస వాహనంపై ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. తెల్లవారుజామున సుప్రభాతంతో స్వామిని మేల్కొలిపి నిత్యకైంకర్యాల అనంతరం విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. పరివార దేవతలకు అభిషేకాలు చేసి నైవేద్యాలు సమర్పించారు. 10 గంటలకు చంపకవల్లీ, పరాశరేశ్వర స్వామికి స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం స్వామి, అమ్మవారు హంస వాహనాన్ని అధిరోహించారు. వర్షం కురుస్తుండడంతో గ్రామోత్సవాన్ని రద్దు చేసి ఆలయంలో ఆస్థానం నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు దేవేరులకు సర్కారు హారతి ఇచ్చారు. ఉత్సవాల్లో నాలుగో రోజు సోమవారం సాయంత్రం శేష వాహనం నిర్వహించనున్నట్టు ఆలయ అధికారులు తెలిపారు.


హంస వాహనంపై పరాశరేశ్వరస్వామి

ఆర్‌యూపీపీ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

నాయుడుపేట టౌన్ : రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత్ పరిషత్ (ఆర్‌యూపీపీ) తిరుపతి జిల్లా నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలోని ఎల్ఏ సాగరం ఉన్నత పాఠశాలలో ఆదివారం ఆ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సంపత్‌కృష్ణ సారథ్యంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లాల కార్యవర్గ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు వెల్లడించారు. తిరుపతి జిల్లా అధ్యక్షుడిగా నాయుడుపేటకు చెందిన గడదాసు వెంకటేశ్వర్లును, అలాగే గౌరవాధ్యక్షుడిగా బత్తిన రవి కుమార్, ప్రధాన కార్యదర్శిగా ఎస్.విజయకుమార్, జాయింట్ సెక్రటరీగా భాస్కర్, జిల్లా మహిళాధ్యక్షురాలిగా షేక్ జాహిద, ప్రధాన కార్యదర్శిగా కే.శ్రావణిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు. వెంకటేశ్వర్లును, నూతన కార్యవర్గ సభ్యులందరినీ సన్మానించారు. ఉపాధ్యాయులు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నూతన కార్యవర్గం తెలిపింది. కార్యక్రమంలో అసోసియేషన్ ఉమ్మడి జిల్లాల నాయకులు చిట్టేటి కుమార్, ఎస్.శ్రీనివాసులు, ఖాదర్‌షా, రామసుబ్బయ్య, సుబ్రహ్మణ్యం, డీ.రఘునాథ్‌తదితరులు పాల్గొన్నారు.


ఆర్‌యూపీపీ తిరుపతి జిల్లా అధ్యక్షులుగా ఎన్నికైన గడదాసును సత్కరించిన అసోసియేషన్ నాయకులు

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న లారీ

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని నీర్పాకోట గ్రామ సమీపంలోని పెట్రోల్ బంకు వద్ద ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీ కొనడంతో మోటార్ సైక్లిస్టు మోహన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం.. కాటూరు గ్రామానికి చెందిన మోహన్ ఆదివారం నీర్పాకోట గ్రామంలోని పెట్రోల్ బంకులో ద్విచక్ర వాహనానికి పెట్రోల్ పట్టుకుని వస్తుండగా లారీ మితిమీరిన వేగంగా వచ్చి ఢీకొంది. దీంతో మోహన్‌కు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే అతన్ని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ వెంకట నరసింహం తెలిపారు.


గాయపడిన మోహన్

తైక్వాండో విజేత నాయుడుపేట


నాయుడుపేట క్రీడాకారులకు ట్రోఫీ అందజేస్తున్న నిర్వాహకులు

నాయుడుపేట టౌన్ : నాయుడుపేటలో ఆదివారం రాత్రి వరకు జరిగిన నెల్లూరు జిల్లా స్థాయి తైక్వాండో– 2024 చాంపియన్ షిప్ పోటీల్లో విజేతలుగా నాయుడుపేట క్రీడాకారులు నిలిచారు. ఈ పోటీల్లో తిరుపతి, నెల్లూరు జిల్లాల నుంచి 200 మందికి పైగా క్రీడా కారులు పాల్గొన్నారు. మొదటి చాంపియన్‌షిప్‌ను నాయుడుపేట దక్కించుకోగా ద్వితీయ స్థానంలో నెల్లూరు, తృతీయ స్థానంలో వేదాయపాళెం, నాలుగో స్థానంలో వెంకటగిరి క్రీడాకారులు నిలిచినట్టు అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఉయ్యాల పవన్‌కుమార్ తెలిపారు. వారికి ట్రోఫీలను అందించి ఘనంగా సత్కరించారు. తైక్వాండో మినీ సబ్ జూనియర్, క్యాడెట్, జూనియర్, సీనియర్ విభాగాల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు పతాకాలతో పాటు జ్ఞాపికలను అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. విజేతలు రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటారని తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ వేణుగోపాల్ చెప్పారు. ఆ పోటీల్లోనూ సత్తా చాటి పేరు తేవాలని ఆకాంక్షించారు.

ఎన్ఎస్‌యూలో జగన్నాథ రథయాత్ర



తిరుపతి సిటీ: స్థానిక జాతీయ సంస్కృత వర్సిటీ ఒడిశా చైర్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి జగన్నాథస్వామి రథయాత్ర ఘనంగా నిర్వహించారు. వర్సిటీలోని జగన్నాథ మందిరం నుంచి ప్రారంభమైన రథయాత్రను వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి ప్రారంభించారు. అనంతరం తిరుపతిలోని అన్ని ప్రధాన వీధులల్లో జగన్నాథ స్వామి నామస్మరణతో అట్టహాసంగా కొనసాగింది. కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ రమాశ్రీ, డీన్ దక్షణమూర్తి శర్మ, ప్రొఫెసర్లు రజనీకాంత్ శుక్లా, జి శంకరనారాయణ, జ్ఞాన రంజన్ పాండా, అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేశారు.

రుయాలో నర్సుపై రోగి దాడి

తిరుపతి తుడా: రుయా ఎమర్జెన్సీ మెడికల్ కేర్ విభాగంలో చికిత్స పొందుతున్న ఓ పేషెంట్ విధుల్లో ఉన్న నర్సుపై దాడి చేసి గాయపరిచాడు. ఈ ఘటన ఆదివారం రాత్రి రుయాలో చోటుచేసుకుంది. అధికారులు తెలిపిన సమాచారం..మదనపల్లె రాజానగర్‌కు చెందిన దుర్గాప్రసాద్ పురుగుల మందు సేవించడంతో వైద్యం కోసం శుక్రవారం అతడిని కుటుంబ సభ్యులు రుయాకు తీసుకువచ్చారు. చికిత్స పొందుతున్న క్రమంలో పురుగుల మందు తీవ్రత వల్ల ఇరిటేషన్‌కు గురవడంతో మానసిక సమస్య కారణంగా విచక్షణ కోల్పోయిన పేషెంట్ వైద్య సేవలు అందిస్తున్న నర్సు యశోద(38)పై దాడి చేశాడు. సెలైన్ స్టాండ్ తో వెనకనుంచి కొట్టడంతో ఆమె తలకు తీవ్రగాయమైంది. కుట్లు వేసిన వైద్యులు చికిత్స చేశారు. కాగా మూడు రోజుల గడుస్తున్నా రోగిని ఇంటికి పంపించలేదని, మందుల వాడటం వల్ల సైడ్ ఎఫెక్ట్స్ మూలాన విచక్షణ కోల్పోయి దాడి చేసినట్టు అక్కడి వైద్యులు నిర్ధారించారు. దాడి వెనుక ఎలాంటి దురుద్దేశం లేదని తేలడంతో అతన్ని ప్రత్యేకంగా ఉంచి చికిత్స అందిస్తున్నారు.


గాయపడిన నర్సుకు చికిత్స చేస్తున్న వైద్యులు